క్లుప్తంగా

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి



స్వాముల వారికి అభిషేకం చేస్తున్న పీఠాధిపతి బ్రహ్మానంద సరస్వతి

ఓర్వకల్లు : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడిచినప్పుడే హైందవ మతం బలపడుతుందని హిందూ ధార్మిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, నైమిశారణ్య పీఠాధిపతులు బాల బ్రహ్మానంద సరస్వతి అన్నారు. బుధవారం మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో నిర్వహించిన శివలీలా విలాస లింగతత్వం గురించి ప్రవచన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయ అధికారులు పీఠాధిపతికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. కార్యక్రమానికి ముందుగా బుగ్గరామేశ్వరస్వామిని దర్శించుకొని అభిషేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన ప్రవచన కార్యక్రమంలో బ్రహ్మానంద సరస్వతి మాట్లాడుతూ.. పరమ శివుని పూజిస్తే సకల శుభాలు కులుగుతాయని తెలిపారు. పంచాక్షరి జపాలతో సకల పాపాలు తొలగిపోతాయని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, ఈఓ డీఆర్‌కేవి ప్రసాద్, అర్చకులు క్లై లక్ష్మీనారాయణశర్మ, సచివాలయ మండల కన్వీనర్ లోటర్ బాషా పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన అహ్మద్ అలీఖాన్



మేయర్ రామయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న అహ్మద్ అలీఖాన్

కల్లూరు: ఇటీవల వైఎస్సార్‌సీపీలో చేరిన అహ్మద్ అలీఖాన్ బుధవారం సాయంత్రం పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్యను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త మృతి

పాణ్యం:మండల పరిధిలోని తొగర్చేడు గ్రామానికి చెందిన సీనియర్ కార్యకర్త అన్నపురెడ్డి శిఖామణి (80) అనారోగ్యంతో బుధవా రం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళిఅర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 1985 నుంచి తన వెంటనే ఉండి పలు సూచనలు, సలహాలు ఇచ్చేవారన్నారు.పార్టీ బలోపేతానికి కృషి చేశాడన్నారు.శిఖామణి మృతి తీరని లోటన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి,అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

సారా విక్రేత అరెస్టు

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లులో అక్రమంగా సారా అమ్ముతున్న ఓ వ్యక్తిని బుధవారం పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని పెండేకంటి నగర్‌కు చెందిన షికారి పరుశు అనే వ్యక్తి గుట్టపాడు పరిసర ప్రాంతంలో నాటుసారా అమ్ముతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఆ మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తీసుకొచ్చారు. అతని వద్ద నుంచి 15 లీటర్ల సారాను, టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని స్వాధీనం చేసుకొని అరెస్టు చూపినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా నాటుసారా,మట్కా, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఎమ్మార్పీఎస్‌ఎస్‌తో వారికి సంబంధం లేదు

కర్నూలు(సెంట్రల్): కోడుమూరు నియోజక వర్గం గూడూరుకు చెందిన సుజాత మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘర్షణ సమితి(ఎమ్మార్పీఎస్ఎస్)మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాల ని చెప్పుకొని తిరుగుతోందని, ఆమెకు ఎమ్మార్పీఎస్‌ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదని సమి తి జిల్లా అధ్యక్షుడు దివాకర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుజాతతోపాటు శ్వేత,లలితమ్మ, చిన్నబాబు, సుమిత్ర అనే మహిళ లు కూడా ఎమ్మార్పీఎస్‌ఎస్ సభ్యులమని విజిటింగ్ కార్డులు తయారు చేయించుకుని తిరుగు తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. వారి కి తమ సంఘానికి ఎలాంటి సంబంధం లేదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు.

ఢిల్లీ గడ్డపై రాయలసీమ గళం వినిపిస్తాం

కర్నూలు కల్చరల్: రాయలసీమ సమస్యలను పరిష్కరించాలనని డిమాండ్ చేస్తూ రాయలసీమ స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టారు. రాయలసీమ ఉద్యమకారులు, రాయలసీమ వాదులు, సీమ ప్రజలు బుధవారం కర్నూలు నుంచి ప్రత్యేక రైలులో ఢిల్లీ బయలు దేరి వెళ్లారు. స్టీరింగ్ కమిటీ చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలో ఢిల్లీ కార్యక్రమం పార్టీలకు అతీతంగా రాయలసీమకు సంబంధించిందన్నారు.

జోరుగా వర్షాలు

- తెరచుకోని ముసురు, వీడని వర్షం
- పొలాలు పదును కావడంతో రైతుల హర్షం
- వాగులకు భారీగా చేరుతున్న వరదనీరు





కల్లూరు పరిధిలోని పత్తి పంటలో నిలిచిన వర్షం నీరు,కల్లూరు అర్బన్ 29వ వార్డు పరిధిలోని 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీస్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కోడుమూరు రూరల్: తుపాను ప్రభావంతో మండలంలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ఖరీఫ్ కింద సాగు చేసిన పత్తి, కొర్ర, వేరుశనగ, కంది, పొద్దు తిరుగుడు వంటి పంటలు కొంత మేలు జరుగుతున్నా, కొన్ని గ్రామాల్లో పత్తి పొలాల్లో వర్షపునీరు భారీగా నిలిచిపోవడంతో పంట దెబ్బతినే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల పట్ల మండలంలోని గ్రామాల ప్రజలు , రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జయన్న సూచించారు. ముఖ్యంగా హంద్రీనదీ పరివాహక గ్రామాల ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రాకూడదని హెచ్చరించారు.

కల్లూరులో 35.6 మిమీ వర్షపాతం

కల్లూరు: మండల వ్యాప్తంగా జోరుగా వానకురవడంతో వివిధ గ్రామాల్లోని రోడ్లన్నీ జలమయం అయ్యాయి. పంట పొలాల్లో వర్షం నీరు నిలిచింది. మండలంలో 35.6 మిమీ వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. జోరుగా వర్షాలు కురవడంతో పొలాలు పదునవుతాయని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలతో కల్లూరు అర్బన్ ప్రాంతంలోని రోడ్లన్నీ జలమయమై అక్కడ అక్కడ వర్షం నీరు రోడ్లపై నిలిచింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

ఎడతెరిపిలేని వాన....

పాణ్యం : మండలంలో గత నాలుగు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుంది. ముసురు చినుకులతో మూడు రోజులుగా కురుస్తున్న వాన బుధవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు భారీగా కురిసింది. మండలంలో 21.2మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాగులు వరదనీటితో ప్రవహిస్తున్నాయి. మండల పరిధిలోని గోనవరం, కొత్తూరు, అనుపూరు, పాణ్యం వద్ద వొద్దెల వాగు, కానుగల వాగులకు వరదనీరు చేరింది. అనుపూను వద్ద ఉన్న కొర్రవాగు పొంగిపొర్లుతోంది. మద్దూరు వద్ద పొలాల్లో వర్షపునీరు నిలిచాయి. పాణ్యం వద్ద జుర్రాగులకు వరదనీటి ప్రవాహం అధికంగా ఉంది. పిన్నాపరం కొండలపై వదర ప్రవాభవం అధికంగా కనిపించింది. వాగులకు భారీ ఎత్తున నీరు రావడంతో చెట్టు కొట్టుకుపోయాయి. జలపాతానికి కూడా వరద నీరు చేరింది. ప్రజలను రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు.

వదలని వానలు

గడివేముల: మండలంలో నాలుగు రోజులుగా ముసురు ఉండటంతో పాటు వర్ష వీడటంలేదు. వర్షాలకు చలిగాలులు తోడయ్యాయి. మండలంలో 32.2 మిల్లీమీటర్ల సోమవారం వర్షపాతం నమోదైంది. సాగు పనులు ప్రస్తుత వర్షాలకు ఊపందుకుంటున్నాయి. మెట్ట ప్రాంత రైతులు సాగు చేసిన పంటలకు వర్షం ఎంతో ఉపయోగపడుతుందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 32 వేల ఎకరాల సాగుభూమి ఉంది. ఇందులో గతంలో ఎన్నడూ లేని విధంగా 22 వేల ఎకరాల దాకా పంటలను సాగుచేసేందుకు సిద్ధం చేసుకున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పలు గ్రామాల్లో వర్షనీరు నిలబడి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.





పిన్నాపురం కొండపై వరద ప్రవాహం ధాటికి కొట్టుకొపోయిన చెట్టు, కొండ లోయల్లో నిలిచిన వర్షపు నీరు



బిలకలగూడూరు గ్రామంలో వీధుల్లో నిలిచిన వర్షపునీరు

కూలిన మట్టిమిద్దె



కల్లూరు: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు కల్లూరు అర్బన్ పరిధిలోని ఊరువాకిలి వద్ద మల్లికార్జునకు చెందిన మట్టి మిదె కూలింది. ఆయన మగ్గం పని చేస్తూ (చేనేత కార్మికుడు)జీవనం సాగిస్తున్నాడు. మగ్గం పరికరాలు, వస్తువులు సుమారుగా రూ. 70వేల నుంచి లక్ష రూపాయాల వరకు నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న కల్లూరు పరిరక్షణ సమితి నాయకులు చంద్రశేఖరప్ప, విశ్వనాథ్ ఇంటిని సందర్శించి ప్రభుత్వం సహాయం అందించాలని కోరారు.

బడి బయటి పిల్లలను బడిలో చేర్పించాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శివనాగప్రసాద్



విద్యార్థి శివాజీని వర్కూరు హైస్కూల్‌లో చేర్పిస్తున్న డీఎల్‌డీఓ బాలక్రిష్ణారెడ్డి

ఓర్వకల్లు: బడి బయట ఉన్న పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలని ఎంపీడీఓ శివనాగప్రసాద్ ఆదేశించారు. బుధవారం మండలంలోని నన్నూరు జెడ్పీ హైస్కూల్‌ను ఎంఈఓ ఓంకార్ యాదవ్ కలిసి సందర్శించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. జగనన్న విద్యా కానుక కిట్ల గురించి హెచ్‌ఎం ప్రాణేశ్ కుమార్‌ను ఆరా తీశారు. రెండవ సెమిస్టర్‌కు సంబంధించిన పాఠ్యపుస్తకాలను అందరికీ పంచారా? ఇంకా ఏమైన తక్కువ పడ్డాయా? తక్కువ పడితే వెంటనే ఇండెంట్‌ను తయారు చేసి ఎంఈఓకు పంపాలని సూచించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలన్నారు.

కోడుమూరు రూరల్: బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని కర్నూలు డివిజన్ అభివృద్ధి అధికారి బాలకృష్ణారెడ్డి సూచించారు. బుధవారం ఆయన వర్కూరు గ్రామ సచివాలయాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. బడి బయట ఉన్న పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. 9వ తరగతి వరకు చదివి బడి మానేసి పనులకు వెళ్తున్న వర్కూరు చెందిన విద్యార్థులు మనీషా, శివాజీ వివరాలు తెలుసుకుని వారి ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి బడికి పంపించేలా ఒప్పించారు. అనంతరం ఆ విద్యార్థులను హైస్కూల్‌కు తీసుకెళ్లి హెచ్‌ఎంతో మాట్లాడి 10వ తరగతిలో ప్రవేశాలు కల్పించారు.

పోషకాహారలోప నివారణే ప్రధానం



గర్భిణికి ఐరన్ మాత్రలు అందజేస్తున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): పిల్లల్లో పోషకాహార లోప నివారణ ముఖ్యమని, ఇందుకోసం అంగన్‌వాడీ కేంద్రాలు, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎన్‌ఆర్‌సీ కేంద్రాలను సంప్రదించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక శ్రీరామనగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని జేఎస్‌ఆర్ నగర్, లక్ష్మీనగర్‌లలోని సచివాలయ పరిధిలలో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. బరువు, ఎత్తు తక్కువతో పోషకాహార లోపంతో బాధపడే పిల్లలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ ఇంద్రధనస్సు సర్వేను తనిఖీ చేసి గర్భిణులు, పిల్లలకు సమయానుసారంగా ఇవ్వాల్సిన టీకాలు ఏదైనా కారణం వల్ల ఇవ్వనట్లయితే ఆగస్టు 7 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమంలో టీకాలు వేయించాలన్నారు. అనంతరం ఆయన స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పిల్లలు, తల్లులకు పోషకాహారం, ఐరన్‌మాత్రలు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దివ్య, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

కర్నూలు: ఇద్దరు మట్కా బీటర్లను బుధవారం మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. బుధవారపేటకు చెందిన షేక్ అబ్దుల్ ఫరీద్, షేక్ వలీ బాషా పడిపోయిన కమాన్ల వద్ద భారీగా మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ చిరంజీవి, క్రైం పార్టీ సిబ్బంది ప్రసాద్ సింగ్, చంద్రబాబు నాయుడు నిఘా వేసి మట్కా బీటర్లిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.10 వేల నగదుతో పాటు 9 మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నారు.

ఈరోజు

నేడు సచివాలయం ప్రారంభం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం ఈ. తాండ్రపాడు గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని గురువారం కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ప్రారంభించనున్నట్లు కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దిన్నెదేవరపాడు, పి.రుద్రవరంలో సురక్ష సదస్సులు

కర్నూలు మండలం దిన్నెదేవరపాడు, పి.రుద్రవరం గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష సదస్సులు నిర్వహించనున్నట్లు కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరై అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారన్నారు.

కోడుమూరు రూరల్: మండల కేంద్రం కోడుమూరు గ్రామ సచివాలయం-5 ఆవరణలో గురువారం ఉదయం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు 11 రకాల సర్వీసులకు సంబంధించిన సర్టిఫికెట్లతో పాటు, కొత్త రైస్ కార్డులు, కౌలు కార్డులు అందజేస్తారన్నారు.

అప్రమత్తంగా పనులు చేయండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో అప్రమత్తంగా ఉండాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి సూచించారు. బుధవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదారు రోజులుగా కురుస్తున్న వర్షాలు, గాలి కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందన్నారు. సబ్‌స్టేషన్, లైన్ బ్రేక్ డౌన్స్, ఫీడర్ డౌన్, ట్రిప్పింగ్స్, ఫ్యూజ్ ఆఫ్ కాల్, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ కాలిపోవడం వంటి సమస్యలు వస్తే ముందుగా ఎల్‌సీ తీసుకొని సరఫరా నిలిపివేసుకోవాలని సూచించారు. ఏఈలు, ఏడీఈలు, ఈఈలు తమ పరిధిలోని లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లకు తగిన సూచనలు ఇవ్వాలన్నారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కల్లూరు: బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లకు సూచించారు. బుధవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీఈఆర్(గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రెషియో) సర్వే 100శాతం పూర్తి చేయాలని వెల్ఫేర్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 వనజ కుమారి, పరిపాలన అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓఆర్డీ రవికిషోర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఏ ఒక్క పేద ప్రభుత్వ పథకాలకు దూరం కాకూడదు
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



ఉల్చాలలో జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారురాలికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): కులమతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇప్పటికే దాదాపు అందరికీ న్యాయం జరిగిందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ పేర్కొన్నారు. సాంకేతిక తదితర సమస్యల మూలంగా మిగిలిపోయిన ఏ ఒక్క పేద సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనే సదుద్దేశంలో వారిని గుర్తించి న్యాయం చేసేందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కర్నూలు మండలం ఉల్చాల, నూతనపల్లె గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి బొకేలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు తొలగించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్నారన్నారు. అధికారం చేపట్టిన నాలుగేళ్లకే 99.8 శాతం హామీలు నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 100 శాతం అర్హులకు న్యాయం చేకూరుతుందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, పప్పు నాయుడు నారా లోకేష్, దత్త పుత్రుడు, ప్యాకేజ్ స్టార్ పవన్‌కల్యాణ్ మోసపూరిత వాగ్దానాలను ఎవ్వరూ నమ్మేపరిస్థితి లేదన్నారు. కర్నూలు ఎంపీపీ ధర్మవరం వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు, కరువు కవలలు అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీఓ అజాంఖాన్, ఈఓఆర్డీ నాగేశ్వర్‌రెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు వాసు, మా ర్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మహబూబ్‌బాషా, సొసైటీ చైర్మన్ శేషిరెడ్డి, సర్పంచ్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.


ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు



గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటి వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం చాలా బాగుంది. గతంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగి వ్యయ, ప్రయాసాలను ఓర్చుకుని ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నాం. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులను స్వీకరించి జగన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందజేయడం సంతోషంగా ఉంది.

– ఆరెపోగు మేరమ్మ, భూపాల్‌నగర్

ప్రభుత్వ సాయం బాగుంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న సాయం చాలా బాగుంది. ఇంటి వద్దకే వైఎస్సార్ పింఛన్, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. కులం, మతం, వర్గం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడం అభినందనీయం. ఇప్పుడు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కరోనా కష్టకాలంలోనూ వలంటీర్లు ఇంటి వద్దకే సేవలు అందించిన తీరును ఎవ్వరూ మరిచిపోరు.

– గవ్వల లచ్చమ్మ, స్థానికురాలు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కల్లూరు: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల వాతావరణంలో మార్పులు వచ్చి మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామగిడ్డయ్య సూచించారు. బుధవారం ఉలిందకొండ ప్రాథమిక కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఏఎన్‌ఎంలను ఆదేశించారు. దోమ వ్యాప్తిని అరికట్టడంతో సగం వ్యాధులు దూరమవుతాయన్నారు. ఏఎన్‌ఎంలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



కోటవీధిలో కొలువుదీరిన పీర్లస్వాములకు చదివింపులు సమర్పిస్తున్న భక్తులు



సి.బెళగల్‌లో కొత్త, పాత కొండలయ్యల పీర్ల ఊరేగింపు

ఘనంగా చిన్న సరిగెత్తు

కోడుమూరు రూరల్: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం ఉత్సవాల్లో భాగంగా బుధవారం చిన్న సరిగెత్తు వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్న సరిగెత్తు వేడుకల సందర్భంగా ప్రజలు పెద్ద ఎత్తున చావిళ్లలో కొలువుదీరిన పీర్లదేవుళ్లకు ప్రత్యేక చదివింపులు సమర్పించారు.

సి.బెళగల్: మండల కేంద్రంలో సరిగెత్తు వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి నుంచి తెల్లవారు జాము వరకు కొండలయ్య సరిగెత్తు నిర్వహించారు. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బుధవారం తెల్లవారుజామున కొత్త కొండలయ్య, పాత కొండలయ్య, కోసిక దేవుళ్ల పీర్లను గ్రామంలో ఊరేగించి పాత బస్టాండ్‌లో సవారిని నిర్వహించారు. బుధవారం రాత్రి నుంచి మండలంలోని పలు గ్రామాలలో చిన్న సరిగెత్తును నిర్వహించారు.

సుపరిపాలన అందిస్తున్న ఘనత జగనన్నదే



ముడుమలగుర్తిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డా.సుధాకర్

కోడుమూరు రూరల్: సచివాలయ, వలంటరీ వ్యవస్థల ద్వారా ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ వర్షంలోనూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించడంతో పాటు, వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. సీసీ రోడ్లు, మురుగు నీటి కాల్వల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈ సందర్భంగా ముడుమలగుర్తి వాసులు ఎమ్మెల్యేకు విన్నవించగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. అర్హత ఉండి ఎవ్వరికైనా పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. 70ఏళ్ల చరిత్రలో ఏ ప్రభుత్వ పాలనలోనూ ప్రజల ఇంటి ముంగిటకే ఎమ్మెల్యే వచ్చిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసులు, ఈఓఆర్డీ మంజుల, డీటీ రామాంజినేయులు, ఏపీఓ రమాదేవి, స్థానిక వైసీపీ నాయకులు మధు, ప్రహ్లాదరెడ్డి, మల్లేష్, మద్దిలేటి, సుంకన్న, లాయర్ ప్రభాకర్, బలరాం, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటరీలు, హెల్త్, హౌసింగ్, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చైల్డ్ ఇన్ఫోను అప్‌డేట్ చేయండి



బ్రాహ్మణదొడ్డి పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

సి.బెళగల్: పాఠశాలలో చేరిన విద్యార్థుల వివరాలను చైల్డ్ ఇన్ఫోలో (ఆన్‌లైన్‌లో) అప్‌డేట్ చేయాలని మండల ప్రత్యేక అధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల అన్నారు. బుధవారం ఆమె ఎంపీడీఓ రాముడుతో కలిసి మండలంలోని బ్రాహ్మణదొడ్డి, మారందొడ్డి, బురాన్‌దొడ్డి గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిష్టర్లను, ఆన్‌లైన్‌లో చైల్డ్ ఇన్ఫో నివేదికలను పరిశీలించారు. పాఠశాలలో చేరిన, ఆన్‌లైన్‌లో నమోదు అయిన విద్యార్థుల సంఖ్యకు తేడా గమనించిన ఆమె ఎప్పటికప్పుడు చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.